క్లుప్తంగా

నేడు ఎంపీ గురుమూర్తి పర్యటన

కేవీబీపురం: తిరుపతి ఎంపీ(సత్యవేడు సమన్వయ కర్త) మద్దిల గురుమూర్తి మంగళవారం మండలంలో పర్యటించనున్నారని వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ గవర్ల కృష్ణయ్య తెలిపారు. ఎంపీ మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశమై పలు సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. 11 గంటలకు పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతారని తెలిపారు.

సత్యవేడు రన్నర్స్‌ జట్టుకు సన్మానం



పెరిందేశం జట్టును అభినందిస్తున్న నేతలు

కేవీబీపురం: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రికెట్‌ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచిన పెరిందేశం (కేవీబీపురం) జట్టు సభ్యులను జెడ్పీటీసీ సభ్యురాలు మూర్తి మునెమ్మ, ఆరె ఎంపీటీసీ సభ్యుడు మూర్తి సుబ్బయ్య సోమవారం శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్రీడాకారుల అభినందన సభలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, కెప్టెన్‌ బత్తెయ్య, సంపత్‌, సాయికృష్ణ, సాయి, వంశీ, డేవిడ్‌, చిన్నా, గోపి, విష్ణు, ఢిల్లీ బాబు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వరదయ్యపాళెం: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

90 శాతం కులగణన పూర్తి



వరదయ్యపాళెంలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

వరదయ్యపాళెం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వే వరదయ్యపాళెం మండలంలో 90 శాతం పూర్తయినట్లు మండల ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. మండలంలో 13 సచివాలయాల పరిధిలో 16730 ఇళ్లకు సంబంధించి 46226 మంది జనాభా ఉన్నారు. ఇందులో 15052 ఇళ్లలో సర్వే చేపట్టి వివరాలను యాప్‌లో నమోదు చేసినట్లు ఆయన వివరించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, గ్రామ కార్యదర్శుల సమన్వయంతో సకాలంలో 90శాతం సర్వే పూర్తి చేయగలిగామని ఎంపీడీఓ వివరించారు. మిగిలిన గృహాలకు సంబంధించి పలుచోట్ల గృహ యజమానులు బయట ప్రాంతాల్లో ఉండడంతో కొంత ఆలస్యమవుతోందని, అది కూడా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ లైవ్లీహుడ్‌ బిజినెస్‌ ఇంక్యుబేటర్‌ సెంటర్‌లో ఫిబ్రవరి రెండో వారం నుంచి ప్రారంభం కానున్న పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కోసం ఆసక్తిగల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ జీవనజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల వ్యవధితో శిక్షణ ఉంటుందని ట్రైనింగ్‌ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఇంటర్‌ ఉత్తీర్ణులైన ఆసక్తిగల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు ఫోన్‌ 98852 44006 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సినీ కవి వేటూరికి నివాళి



వేటూరికి నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు, కళాకారులు

తిరుపతి కల్చరల్‌: సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తికి రాయలసీమ రంగస్థలి చైర్మన్‌ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నివాళులర్పించారు. వేటూరి జయంతిని పురస్కరించుకొని రంగస్థలి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అందమైన పాటల్ని అలవోకగా రచించడంలో వేటూరి అసాధ్యుడని కొనియాడారు.

కుష్టుపై అవగాహన పెంచాలి

తిరుపతి అర్బన్‌: స్పర్శ లెప్రసీపై పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని డీఆర్వో పెంచల కిషోర్‌ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పర్శ లెప్రసీ అవగాహనా కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్‌ను జిల్లా రెవెన్యూ అధికారితోపాటు జిల్లా వైద్య అధికారి డాక్టర్‌ శ్రీహరి, జిల్లా లెప్రసీ ఎయిడ్స్‌, టీబీ ఆఫీసర్‌ డాక్టర్‌ సి.అరుణ సులోచన, ఎపిడమాలజిస్ట్‌ డాక్టర్‌ కిరణ్‌ నాయక్‌ ఆవిష్కరించారు.

ఆదిమూలం.. దిగజారుడు రాజకీయాలు మానుకో..



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవేడు వైఎస్సార్‌ సీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు



బుచ్చినాయుడుకండ్రిగలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

సత్యవేడు: కోనేటి ఆదిమూలం దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని సత్యవేడు సింగిల్‌ విండో అధ్యక్షుడు కేవీ నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదిమూలం పెద్దిరెడ్డిపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ సోమవారం సత్యవేడులో వైఎస్సార్‌ సీపీ నాయకులు కె.సుశీల్‌కుమార్‌రెడ్డి, కె.చంద్రశేఖర్‌ రెడ్డి తదితరులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌ సీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు డిమాండ్‌ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి బైక్‌లో వచ్చారని హేళన చేశారని, 40 ఏళ్ల క్రితమే సత్యవేడు ప్రాంతంలో తెలుగుగంగ కాలువ తవ్వకాలను పీఎల్‌ఆర్‌ కన్‌స్ట్రక్షన్‌తో పనులు చేపట్టారని గుర్తు చేశారు. రాజకీయాల్లో మంత్రి పెద్దిరెడ్డి నిప్పులాంటి మనిషి అన్నారు. ఆయన సారథ్యంలోనే ఆదిమూలం 44వే ఓట్ల మెజారిటీ సాధించారని గుర్తు చేశారు. పెద్దిరెడ్డిపై చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలన్నారు. నారాయణవనంలో ఎమ్మెల్యే ఇంటికి సమస్యలు చెప్పుకునేందుకు కార్యకర్తలు వెళితే ఆయన కొడుకు తన్ని తరుముతున్నారని ఆరోపించారు. ఉద్యోగులను దుర్భాషలాడారన్నారు. సత్యవేడుకు బదిలీ చేయించేందుకు మహిళా తహసీల్దార్‌ వద్ద రూ.5 లక్షలు తీసుకొన్నారని, 6 నెలల్లోపే ఆమెను ట్రాన్స్‌ఫర్‌ చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బెల్లు రమేష్‌, రామయ్య, శేఖర్‌, రమణ, రవిరెడ్డి, వంశీరెడ్డి, రూబెన్‌, గోవిందస్వామి, కోఆప్షన్‌ సభ్యురాలు మస్తానీ, మధుసూదన్‌రావు, పునీతకుమార్‌, శ్రీధర్‌ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శరవణన్‌, టెంకాయల కృష్ణయ్య, సురేష్‌, రాబర్టు, చిన్నబ్బ, ఢిల్లీ, బాబాయాదవ్‌, జోసెఫ్‌, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూలానికి పుట్టగతులుండవు

బుచ్చినాయుడుకండ్రిగ: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై నిరాధార ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి రాజకీయంగా పుట్టగతులుండవని వైఎస్సార్‌ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం బీఎన్‌కండ్రిగలో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి ద్వారా 2014, 2019లలో ఎమ్మెల్యే టికెట్‌ తెచ్చుకున్న నిజాన్ని ఆదిమూలం మర్చిపోయి విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. 2019లో ఆదిమూలం గెలుపు తన బాధ్యతగా తీసుకుని నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రి పెద్దిరెడ్డినే విమర్శించడానికి నోరెలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. ఐదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న ఆదిమూలం దళితులకు ఏ రోజూ ప్రాముఖ్యత ఇవ్వలేదని మాజీ సర్పంచ్‌ వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకుడు గురవయ్య విరుచుకుపడ్డాడు. పెద్దిరెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే నీ అవినీతి చిట్టాను బయటపెట్టేందుకు వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సాయి నాయుడు, ప్రసాద్‌ పాల్‌, కొండాగిరి, ఎంపీటీసీ రవి, మణి, వెంకటేశ్వర్లు, సురేష్‌ పాల్గొన్నారు.

తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ఆందోళన



తహసీల్దార్‌తో వాదిస్తున్న రాజేశ్వరమ్మ కుటుంబ సభ్యులు

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం తహసీల్దార్‌ కార్యాలయం వద్ద సోమవారం వెంగారెడ్డికండ్రిగకు చెందిన రాజేశ్వరమ్మ తన కుటుంబ సభ్యులతో కలసి ఆందోళన వ్యక్తం చేశారు. వెంగారెడ్డికండ్రిగలో నాలుగు ఎకరాలు సెటిల్‌మెంట్‌ భూమికి సంబంధించి తన కుమారుడి మరణానంతరం తన పేరిట మార్చాలని తల్లి పిన్నమరెడ్డి రాజేశ్వరమ్మ వరదయ్యపాళెం తహసీల్దార్‌ కార్యాలయంలో అనేక వినతులు అందజేసింది. అయితే ఆమె కోడలు అభ్యంతరం తెలపడంతో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఏడాది క్రితం సంబంధిత భూమిని బ్లాక్‌ లిస్టులో నమోదు చేశారు. అయితే వివాదంలో ఉన్న ఈ భూమిని గత ఏడాది డిసెంబర్‌లో పిన్నమరెడ్డి రాజేశ్వరమ్మకు కనీస సమాచారం లేకుండా ఆమె కోడలి పేరిట మార్చారు. దీనిపై రాజేశ్వరమ్మ తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగి, ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయమై తహసీల్దార్‌ గౌరిశంకరరావును వివరణ కోరగా సంబంధిత భూమిని యథావిధిగా బ్లాక్‌లిస్టులో ఉంచుతామని పేర్కొన్నారు.

నక్కలమిట్ట షికారీల నిరసన



వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న షికారీలు

వరదయ్యపాళెం: చిన్న పాండూరు సమీపంలోని శ్రోత్రియ భూముల్లో షికారీలు గుడిసెలను ఏర్పాటు చేసుకున్న నక్కలమిట్ట వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. విద్యుత్‌ సౌకర్యం గానీ, రోడ్లు గానీ లేక రాత్రివేళల్లో అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీడీఓ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతానని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. బీఎస్పీ మండల కార్యదర్శి శంకర్‌ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆగమోక్తంగా సంకట చతుర్దశి పూజలు



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద సోమవారం ఆగమోక్తంగా సంకట చతుర్దశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేసి, విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్‌ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికసిత్‌ భారత్‌

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డు సచివాలయంలో మున్సిపల్‌ కమిషనర్‌ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం వికసిత్‌ భారత్‌ యాత్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌ పాల్గొన్న ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేశాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, ఎస్వీ రమణ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచితప్రసాదాలు తనిఖీ



భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్న చైర్మన్‌ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో ఉచితంగా భక్తులు అందించే ప్రసాదాల పంపిణీని సోమవారం పాలకమండలి చైర్మన్‌ అంజూరు తారక శ్రీనివాసులు తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. స్వామి అమ్మవార్ల నైవేద్యం అనంతరం నైవేద్య ప్రసాదాన్ని భక్తులకు అందజేయాలన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం–ఆంధ్రా



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌, కె.సుశీల్‌కుమార్‌ రెడ్డి

సత్యవేడు: క్రీడాకారుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం–ఆంధ్రా పేరుతో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తోందని వైఎస్‌ఆర్‌ సీపీ మండల కన్వీనర్‌ కె.సుశీల్‌ కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్‌ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం ఆరు గంటలకు నియోజక వర్గ స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. నియోజవర్గ సాయిలో విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కబడ్డీలో నాగలాపురం మహిళలజట్టు, పురుషులుజట్టు విన్నర్‌గా నిలిచారు. క్రికెట్‌లో మెన్‌, ఉమెన్‌ సత్యవేడు జట్లు విన్నర్స్‌గా నెగ్గాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.చంద్రశేఖర్‌, ఏపీఓ కె.రవి, సర్పంచ్‌ మంజుల, నాయకులు రమేష్‌, వంశీకృష్ణ, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు



శ్రీకాళహస్తిలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి: ఎమ్మెల్సీ డాక్టర్‌ సిపాయి సుబ్రమణ్యం జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముందుగా ఆయన దివంగత నేత వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్‌ సీపీ యువజన విభాగం నాయకులు టీ దామోదర్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ జే మధురెడ్డి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేర్వేరుగా వేడుకలు జరిపారు. అనంతరం సిపాయి సుబ్రమణ్యంను ఘనంగా సన్మానించారు. వన్నెకుల క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వీ బాలాజీప్రసాద్‌ లక్ష్మీపతిరెడ్డి, బుజ్జిరెడ్డి, పెరుమాళ్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, జీవీకేరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటమునిరెడ్డి, గురవారెడ్డి, దీపక్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, కంఠా ఉదయ్‌, పఠాన్‌ ఫరీద్‌ పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: ఎమ్మెల్సీ సభ్యుడు డాక్టర్‌ సిపాయి సుబ్రమణ్యం జన్మదిన వేడుకలు సోమవారం రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్‌ ఆవరణంలో ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌ సీపీ శ్రేణులు, అభిమానులు సమక్షంలో డాక్టర్‌ సిపాయి సుబ్రమణ్యం కేక్‌ను కట్‌ చేసి పంచిపెట్టారు. వైఎస్సార్‌ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌, డాక్టర్‌ జనార్దన్‌, ఎంపీటీసీ సభ్యుడు ఆనందరావు, దామోదర్‌రెడ్డి, రసూల్‌, ఇరానీ ఖాదర్‌, హసన్‌, అరుణాదేవి పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: పంచాయతీ షాపింగ్‌ కాంప్లెక్స్‌ వద్ద సోమవారం ఎమ్మెల్సీ డాక్టర్‌ సిపాయి సుబ్రమణ్యం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, వైఎస్సార్‌ సీపీ మండల ప్రధాన కార్యదర్శి మునికృష్ణారెడ్డి, నాయకులు గురవారెడ్డి, పవన్‌కుమార్‌, దామోధరంరెడ్డి, షణ్ముగం పాల్గొన్నారు.

ఉత్తమ బీఎల్‌ఓకు సన్మానం



బీఎల్‌ఓ అనురాధను సత్కరిస్తున్న తహసీల్దార్‌, రెవెన్యూ సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉత్తమ పనితీరు కనబరిచిన వెస్ట్‌ వరత్తూరు పోలింగ్‌ కేంద్రం బీఎల్‌ఓ అనురాధను సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ భార్గవి అధ్యక్షతన రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ మాట్లాడుతూ.. సత్యవేడు నియోజకవర్గంలోనే ఉత్తమ బీఎల్‌ఓగా అనురాధ ఎంపిక కావడం, ఆమె గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్‌ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవడం అభినందనీయమని తెలిపారు.

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు



వైద్య సేవలను పరీక్షిస్తున్న టాస్క్‌ఫోర్స్‌ టీం

ఏర్పేడు: గ్రామాల్లో మాతాశిశు మరణాలను నివారించడానికి వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్‌ జిల్లా టీం సభ్యులు శ్రీనివాసరావు, నాగేంద్ర కుమార్‌ అన్నారు. సోమవారం పాతవీరాపురం వైఎస్సార్‌ హెల్త్‌ క్లినిక్‌లో జరుగుతున్న వైద్య సేవలను తనిఖీ చేశారు. గర్భిణులు, కిశోర బాలికల రక్తహీనత, మాతాశిశు మరణాలు తదితర అంశాలపై వైద్య సిబ్బంది, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కిశోర బాలికలకు ఐరన్‌ మాత్రలను అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రకాష్‌, శివప్రియ, సీహెచ్‌ఓ శివరాజు, సూపర్‌ వైజర్‌ గౌరి పాల్గొన్నారు.

నేడు బాడీబిల్డింగ్‌ పోటీలు

తిరుపతి కల్చరల్‌: తిరుపతి జిల్లా బాడీ బిల్డింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం యూత్‌ హాస్టల్లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల క్రీడాకరులకు బాడీ బిల్డింగ్‌ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ఈశ్వరప్రకాష్‌, శివప్రసాద్‌ రాయల్‌ తెలిపారు. ఈమేరకు వారు పోటీలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం జోష్‌ ప్రాపర్టీస్‌ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు మెడల్స్‌, సర్టిఫికెట్లు, మెమెంటోలు, నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

అమర ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్‌



మాట్లాడుతున్న డాక్టర్‌ రమాదేవి గౌరినేని

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమర ఆస్పత్రిలో ఎక్మో పరికరం సహాయంతో అరుదైన శ్వాసకోశ సంబంధిత ఆపరేషన్‌ చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ మహిళ ప్రాణాలు నిలబెట్టినట్లు ఆ ఆస్పత్రి ఎండీ డాక్టర్‌ రమాదేవి గౌరినేని తెలిపారు. అమర ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చిత్తూరు నగరానికి చెందిన పూజిత(30) అనే మహిళ ఊపిరితిత్తులకు హెచ్‌–1, ఎన్‌–1 ఇన్‌ఫెక్షన్‌ సోకి, తీవ్రరూపం దాల్చి 26 రోజుల కిందట ఆస్పత్రిలో చేరారన్నారు. శ్వాసకోశ సంబంధిత నిపుణులు డాక్టర్‌ శివకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో అన్నీ పరీక్షలు చేసి, ఆక్సిజన్‌స్థాయి 60 శాతం కంటే ఎక్కువగా అందుకోలేకపోవడంతో ఐసీయూలో చేర్చి వెంటిలేటర్‌ సహాయంతో కృత్రిమ శ్వాసను అందించినట్లు తెలిపారు. ఆక్సిజన్‌ లెవెల్స్‌ మెరుగుపడకపోవడంతో ఎక్మో పరికరం ద్వారా చికిత్స అందించినట్లు తెలిపారు. 26 రోజుల పాటు ఆస్పత్రి వైద్యబృందం ఎంతో శ్రమించి చికిత్స అందించారన్నారు. ఆమె పూర్తిగా కోలుకోవడంతో సోమవారం ఆమెను డిశ్చార్జ్‌ చేశామన్నారు. బాధితురాలు పూజిత మాట్లాడుతూ అమర ఆస్పత్రి వైద్యబృందం తనకు పునర్జన్మ ప్రసాదించారన్నారు. ఈ కార్యక్రమంలో క్రిటికల్‌ కేర్‌ హెచ్‌ఓడీ డాక్టర్‌ శంకర్‌, శివకుమార్‌రెడ్డి, నాగరాజు, రాధిక, రాకేష్‌, హేమంత్‌, అనిల్‌, రాజేష్‌, అమర ఆస్పత్రి సీఏఓ వేణుగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే ఖబడ్దార్‌



మాట్లాడుతున్న మల్లారపు మధు

తిరుపతి కల్చరల్‌: జెడ్పీటీసీగా ఉన్న వ్యక్తిని ఎమ్మెల్యే గుర్తింపు కల్పించిన పార్టీని, మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే అర్హత కోనేటి ఆదిమూలానికి లేదని, నిందారోపణలు చేస్తే చూస్తూ ఊరుకోం ఖబడ్దార్‌ అంటూ వైఎస్‌ఆర్‌ సీపీ దళిత విభాగం నేతలు హెచ్చరించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వైఎస్‌ఆర్‌ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు మంత్రి పెద్దిరెడ్డిపై కోనేటి ఆదిమూలం చేసిన నిందారోపణలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌ ఆశయాలకు అనుగుణంగా అనేక సంక్షేమ ఫలాలతో పాటు నామినేటెడ్‌ పదవుల్లో సైతం సముచిత స్థానం కల్పిస్తూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి వైఎస్‌ఆర్‌ సీపీ ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేశారన్నారు. ఆదిమూలం తన సొంత అజెండాతో ఇటు ప్రభుత్వంపై ఇటు మంత్రి పెద్దిరెడ్డిపై నిందారోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజగౌడ్‌, దళిత, గిరిజన విభాగం నేతలు మునీంద్ర నాయక్‌, వెంకటస్వామి, చిన్నారాయుడు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సులో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో డీబీటీ బిల్డర్‌, రీసెర్చ్‌ డెవలప్‌మెంట్‌ సంయుక్త ఆధ్వర్యంలో ట్రైనింగ్‌ ఆన్‌ జినోమిక్స్‌ అండ్‌ బయోలాజికల్‌ డేటా బేసిస్‌ అనే అంశంపై సోమవారం వర్సిటీలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ భారతి హాజరయ్యారు. స్విమ్స్‌ బయో ఇన్‌ఫర్మేటిక్స్‌ విభాగాధిపతి ప్రొఫెసర్‌ ఉమామహేశ్వరి, డీన్‌ ప్రొఫెసర్‌ సుజాత, ఏపీ ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్‌ ప్రొఫెసర్‌ ఉమామహేశ్వరి, ప్రొఫెసర్‌ ఆర్‌ ఉషా, డాక్టర్‌ దీప్తిక్‌ సతీష్‌, డాక్టర్‌ సుదర్శన్‌ వరదరాజన్‌, డాక్టర్‌ పీర, డాక్టర్‌ స్వామి, శ్రీదేవి, ప్రొఫెసర్‌ స్వర్ణలతాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు విరాళం



విరాళం అందజేస్తున్న పోతుగుంట రాజేష్‌

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పోతుగుంట రాజేష్‌ తన తండ్రి శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్‌ పోతుగుంట గురవయ్యనాయుడు పేరున సోమవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును పాలకమండలి చైర్మన్‌ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి, దాతకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు.

వీరభద్రస్వామి ఆలయానికి మహర్దశ



నారాయణవనంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి అలాయం

నారాయణవనం: మండల కేంద్రమైన నాయణవనంలోని టీటీడీ అనుబంధ ఆలయమైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని పూర్తి స్థాయిలో పునర్నిర్మించడానికి టీటీడీ పాలకమండలి రూ.7 కోట్లను కేటాయిస్తూ తీర్మానం చేసింది. నారాయణవనం కోటవీధిలోని వీరభద్రస్వామి ఆలయాన్ని 14వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయులు నిర్మించినట్లు తెలుస్తోంది. ఆలయానికి చుట్టూ ఇళ్ల నిర్మాణాలతో వీధుల ఎత్తు పెరిగింది. దీంతో అంతరాలయం లోతట్టు అవడంతో వర్షపు నీరు ఆలయంలోకి చేరడం, గోడలు బీటలువారడం, గోపుర శిల్పాలు విరిగిపోవడంతో టీటీడీ ఇంజినీరింగ్‌ విభాగం ఆలయాన్ని పూర్తిగా పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. సోమవారం జరిగిన పాలకమండలి సమావేశంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని ఎత్తు పెంచి పూర్తి స్థాయిలో నిర్మించడానికి రూ.7 కోట్లు కేటాయించడంతో స్థానికులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని రెండు ఆలయాల్లో ఒకటి నారాయణవనంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం కాగా, మరొకటి కర్నూలు జిల్లా సుంకేశుల ప్రాజెక్ట్‌ నిర్మాణంలో నీటమునిగిపోయినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

తలకోనలో శాస్త్రోక్తంగా పూజలు

భాకరాపేట: తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. సోమవారం వేకువ జామున సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపారు. అనంతరం అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజా కార్యక్రమం సాగింది. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మాఘ మాసం సమీపిస్తుండడంతో ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. భక్తులకు అర్చకులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆకాశగంగ నుంచి నాలుగు లేన్ల రోడ్డు

తిరుమల: తిరుమలలోని ఆకాశగంగ నుంచి ఔటర్‌ రింగ్‌ రోడ్డు వరకు రెండు వరుసల రహదారిని నాలు గు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు రూ.30.71 కోట్లతో టెండరు ఆమోదించినట్లు టీటీడీ చైర్మన్‌ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుమలలో సోమవారం జరిగిన పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలివున్నాయి.

- తిరుమల అన్నమయ్య భవనం సమావేశ మందిరం ఆధునికీకరణలో భాగంగా దృశ్యశ్రవణ అనుసంధాన పరికరాల ఏర్పాటుకు ఆమోదం.
- శ్రీవారి దర్శనానికి దేశవ్యాప్తంగా విచ్చేసే భక్తుల సౌకర్యార్థం రూ.2.28 కోట్లతో సప్తగిరి సత్రాలు–6, 7 బ్లాకుల అభివృద్ధి పనులకు టెండరు ఆమోదం.
- తిరుమలలోని శ్రీవేంకటేశ్వర, ఆదిశేషు, శంకుమిట్ట విశ్రాంతి గృహాల అభివృద్ధి, పెయింటింగ్‌ పనుల కోసం రూ.10.90 కోట్ల మంజూరుకు పరిపాలన అనుమతికి ఆమోదం.
- నారాయణవనంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి ఆలయానికి రాజగోపురం, రాతిప్రాకారం నిర్మాణానికి రూ.6.90 కోట్లు మంజూరుకు ఆమోదం.
- తిరుపతి నగరంలో శ్రీవారి పాదాల చెంత శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రిని ఇకపై శ్రీపద్మావతి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ చైల్డ్‌ హెల్త్‌గా వ్యవహరించనున్నారు.
- తిరుపతి ప్రెస్‌క్లబ్‌ అధ్యక్షుడు భాస్కర్‌ రెడ్డి అధ్యక్షతన తిరుమల, తిరుపతి మీడియా ప్రతినిధులతో ఏర్పాటైన శ్రీవాణి ట్రస్టు నిజనిర్ధారణ కమిటీ తన నివేదికను టీటీడీ చైర్మన్‌ భూమన కరుణాకరరెడ్డికి, ఈవో ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు.